స్టేషను పంపు

ఆమెని మొదట రైలుస్టేషన్ నీళ్ళపంపుదగ్గర చూశాడు సూర్యారావు.

అతనికి ఆవూరు గూడ్సుస్టేషన్‌కి బదిలీ ఐ, ఆమెను చూసీ, తనకి టిక్కెట్లుఇచ్చే గుమస్తాపని అయివుండకూడదా అనిపించింది. ఆమె తక్కిన ఆడవాళ్ళతో రాదు నీళ్ళకి. వాళ్ళ తగూలతో కలవడం ఇష్టం లేకనేమో! అందుకనే అతను గూడ్సు షెడ్డు తాళంవేసి ఆలస్యంగా సాయంత్రం ఇంటికిపోయేప్పుడు ఒంటరిగా కనబడ్డది ఆమె. బిండి నిండి నీళ్ళు కిందికి గంతులేస్తున్నాయి.: తూర్పున పచ్చగా మెరుస్తున్న మబ్బులోంచి తళ తళ మంటున్నాయి కిందికి దొర్లుతూ. నదినెత్తి ఫాల్గుణమాసపు చంద్రవంక వంక చూస్తోందేమో ఆమె గంగరావిచెట్టు ఆకుల మధ్యనించి, ఆ ఇనపకడ్డీమీద చేతి నానించి, గడ్డం చెయ్యిమీద మోపి, కళ్ళని పైకెత్తి, నిర్జనమైన ప్లాట్‌ఫారంమీద. దూరంగానే నిలబడి చూశాడు, తొరగా నడుస్తున్నవాడల్లా చప్పున ఆగి. ఆమె రెండు నిమషాలైనా కదల్లేదు. లేదు. ఆమె ఏమీ చూట్టంలేదు. ఆకాశంలోనూ లేదు, భూమిమీనా లేదు, ఆ మనసు. గతంలోంచి ఏ ఫిల్మునో తిప్పుకుంటోంది—మనోనేత్రంముందు. అతను తనతోవని

మార్చి ఆమె వేపు దగ్గరగా వొచ్చిందాకా ఆమె అతని వేపు చూడనే లేదు.

"నీళ్ళు పోతున్నాయా."

తన కఠంలోంచే వొచ్చింది ఆ శబ్దం.

నిదానంగా అతనివంక చూసింది. కాని అతను ఇంకా ఆమె మనోకాశంలోకి వెళ్ళినట్టు లేడు. చెవుడా? మూగా? కాని ఆ పెదవులు, కళ్ళు! ఆమె కనబడకపోతే మళ్ళీ, తన నిత్యజీవితంలో పెద్ద లోపం ఏర్పడుతుందీ, చుట్టూ చూశాడు. ఎవరూ లేరు. నిద్రపోయే కుక్కా, పట్టాలలో వెతికే మేకా, పైన యింకా కళ్ళు బాగా కనబడని చంద్ర వంకా మూగ సాక్షులు.

'బిందె ఎత్తనా?'' అన్నాడు దగ్గిరికి వెళ్ళి.

సంధ్య కాంతిలో అంత మెత్తగా నున్నగా...ఆ మెత్తదనం వృత్తమోసం—ఆ చేతులు, ఎత్తు బుజాలు—ఆ పమిట ధృఢత్వం ....శాంతపరుస్తో కళ్ళని—ఆమె నడుం తీరు, నుదుటిమీద బరువుజుట్టు వొంపు, నుదిటి నలుపు మెరుపు మీద జుట్టు నలుపు మెరుపు-లోకపు చీకటి పైన ఆకాశం చీకటి - ఎత్తు పల్లాలలో తళుకుల నొక్కులు— సంధ్యకాంతి దాక్కుంటోంది జుట్టులో రాత్రికి జడిసి. ఎర్రచీర, జడ పైని ఒక్క చక్కని గంగారావిపువ్వు.

చూసింది అప్పుడు నిదానంగా, చిరునవ్వు తనమీద—ఓ నిమిషపు సంబంధం.

"ఎత్తుకోగలను, తీసుకువెళ్ళలేను"

"రోజూ తీసుకెళ్ళవా?"

"రోజూ ఇంతే!'

"జబ్బా!'

"ఊ"

కంఠంలోంచి పెదవుల చివరికి నవ్వు హాస్యం చేస్తోంది తనని.

"ఏం జబ్బు?"

"ఇక్కణ్ణించి పోలేకపోవడం''

"ఏమీ?

నవ్వుతో అతనివంక చూస్తోంది.

"ఏం లేదు వెళ్ళడానికి.... బావుంది కదూ ఇక్కడ?"

"ఊ"

"మీరు వెళ్ళాలిగావును?"

ఛాలెంజి.

"అక్కర్లేదు"

"అయితే రండి. కూచోండి."

ఆ పళ్ళెం గట్టువంక చూసింది.

అడుగు వెనక్కి వేశాడు.

పకపక నవ్వి బిందెని సునాయాసంగా ఎత్తుకుని చక్కా వెళ్ళిపోతోంది.

"మరి వెడుతున్నా వేం?"

"వెళ్ళకపోతే వూరుకుంటారు?"

"ఎవరు?"

"మీరు."

"నేనా!"

"ఈ స్టేషను మీదేగా!" అని వెడుతోంది.

"ఈవాలిటికి వెళ్ళండి. ఎవరన్నా కోప్పడతారేమో! ధైర్యమాలోచించుకుని రేపు మళ్ళీ రండి. కూచోవాలని వుంటే

వెళ్ళిపోయింది దూరంగా. బిందె బరువుతో వొంగిన ఎడం బుజంతో బిందె అంచువొంపులో వెన్నెల మొదటిరేఖ. అట్లానే మంచున్నాడు, ఆమె పొర్లర్ల ఇళ్ళవెనక మలుపుతిరిగిందాకా.

మర్నాడు సాయంత్రం ఐదింటినించే అతని దృష్టి గుడ్సు షెడ్డు తలుపులోంచి పట్టాలూ, ప్లాట్ ఫారం దాటి నీళ్ళ పంపువేపు. రిజిష్టరులో చివరికూడికలు తప్పిపోయి మరీ ఆలస్యమౌతోంది. చంద్రవంక ఇంకొంచెం తూర్పుకి వొంగి నిన్నటి పరిచయాన్ని జ్ఞాపకం చేసింధి. తోళ్ళవాసనని నెట్టి గాలివీస్తోంది దక్షిణంనుంచి వసంత రహస్యాల్ని రక్తానికి పలుకుతో, తీరా తలుపులు మూసే సమయానికి ఆ స్టేషన్‌తో ఏమాత్రం పనిలేని కాళీపెట్టెల గుడ్సుబండి

నీళ్ళ కోసం దీర్ఘంగా ఆగింది, గంగరావిచెట్టు చివరకూడా తనకళ్ళు బడకండా.

తనగది ఎత్తునుంచి గులకరాళ్ళమీదికి పట్టాలిదగ్గిరికి జారి, రాక్షసిబొగ్గుల్ని తప్పించుకుంటో ఆ బోలు పెట్టెల గోడ పీడలో నడుస్తున్నాడు, చాలా గొప్పముహూర్తాలు మించిపోతున్నట్లు. ఇన్ని దబ్బాలు ఎక్కడ దొరికాయో తగిలించుకోడానికి ఆ రైలుకి! ఆ పెట్టెల సందుల్లోంచి వుత్త ప్లాట్‌ఫారం ముక్క, దాని వెనక నాలుగు ఇనప కమ్మిలూ కనపడతాయి. అన్ని సందుల్లోంచీ అంతే, అమ్మా! నీళ్ళ పంపు. దానికింద అదే ఇత్తడి బిందే, దాని మీద తెల్లని వెన్నెల మెరుపుచార. కాఃపోయే నీళ్ళలో. కాని ఆ బిందెకి అర్థంలేదు. విప్పేసిన రవికమల్లే వుత్త అర్థంలేని బిందె. పక్కన పైన వుత్త గంగరావిచెట్టు. ఇంక ఎన్ని సందుల్లోంచి చూపినా ఏమీ లేదు. వుత్త కటకటాలు.

గార్డుపెట్టె. ఎన్నిమైళ్ళ దూరంనడిచాడో తన మనసులోతాను. ఒక్కొక్క కొయ్య బద్దీ ఒకదాటలేని అడ్డం. అబ్బో, చాలా దూరం వచ్చాడు ప్లాటుఫారం దాటి. నాలుగు గజాలు మనుషుల కొలత ప్రకారం. ఎదురుగా గార్డుపెట్టె, గుమ్మంలో గార్డు. తెల్లటి సూటు, మెరిసే బూడ్సులు, అతనిముందు పెట్టె గుమ్మంలోకి కాలు ఎత్తిపెట్టి, వొయ్యారంగా ఆమె, ఆ గార్డుతో నవ్వుతో. తను వెళ్ళిపోయి ఏం చెయ్యడం? వెడుతున్నాయి కాళ్లు. గార్డు చూశాడు అతన్ని, ఏదో అంటున్నాడు. కాని తను ఆగకూడదు అనుకుంటూనే,

"హల్లో! ఛార్లెస్! " అన్నాడు.

"హల్లో! సూర్యారావు! ఇక్కడికి మార్చారా ఏమిటి నిన్ను: బావుందా?"

"చాలా బావుంది." అని అమె. ఎందుకు తనతో ఆ హాస్యం?

"ఏం బావుంది? '

"సంపాదన," అని ఆమె.

"ఏం సంపాదన?"

"వెన్నెల సంపాదన"

"వెడతానోయ్." అని తాను. ముందుకి ఓ అడుగు. వీపు వెనక పెద్దనవ్వు. కోపంతో వెనక్కి తిప్పాడు మెడ.

"నీళ్ళు కారిపోతున్నాయి." అని ఆమె.

"కారిపోతే" ……. …."

"వెళ్ళి పంపు తిప్పేయండి కంపెనీ నీళ్ళు" అని ఆమె.

"తిప్పుకో"

"నేను మాట్లాడుతున్నాను, కనపట్టంలేదా?"

ఛార్లెస్ బిగ్గరగా నవ్వుతున్నాడు.

"రావోయ్. వెళ్ళకు"

"నేనెందుకోయ్ మధ్య."

వెళ్ళిపోయినాడు చిరచిర, మళ్ళీ ఆ పెళ్ళెళ్ళి రెండో వేపు నించి ప్రదక్షిణం చేసుకుంటో. సందులోంచి అటువేపు చూడ్డానికి ఇప్పుడు ఏమీ లేదు. కంకరని చూపుతో కాలుస్తా తొర తొరగా గేటు లోంచి తన ఇంటోకి, వొంటరిగా బావురుమనే రై లువాళ్ళ పిసినికొట్టు గదిలోకి. కాని నిన్నటికంటే ఎంత చీకటి. ఇవాళ! ముందు వాకిట్లోటికి కొంచెం నీళ్ళు పెట్టుకున్నాడు కుంపటిమీద. కప్పు, గొల్లభామ పాల డబ్బా పెడుతున్నప్పుడు రైలు కూతకూసింది. ఇంక వెడితే స్టేషన్ పంపుదగ్గిరికి? ఛీ! సిగ్గయినా లేదు తన మనసుకి: ఎందుకో కోపం అతనికి తెలుసా?

దొడ్లో గబగబ డబ్బాతో బోర్లించుకుంటున్నాడు కాలే ఒంటి మీద చన్నీళ్ళు. తుడుచుకుంటో వొచ్చాడు మరిగే నీళ్ళ పని పట్టించ డానికి. కుంపటి మీద నీళ్ళగిన్నె కింద పడిపోయింది. కప్పు ఏదీ? కుర్చీమీదికి ఎట్లా వెళ్ళిందీ? కప్పునిండా టీ. ఎవరు? వీధిగుమ్మంలోకి ఓ అంగ. బెదిరిచూసే బిళ్ళగన్నేరుపువ్వు పక్కన నీళ్ళబిందె బిందె మూతిలో ఇరుక్కుని కూడా బిగ్గిరగా నవ్వుతో చావలాగా తేలే చంద మామ. బిందెని మోసిన బుజాలేవీ? వస్తుంది లే. లోపలికి వొచ్చి వేడి టీని ముద్దు పెట్టుకున్నాడు.

"బావుందా?"

అక్కడే వుంది మాలతిపొద వెనక. ఎవరు నాటారో అతిగెని:

ఈనాటికి ఆమెని దాచింది. ఏం మాట్లాడదామన్నా తోచలేదు. కప్పు తోచే అటు నడిచాడు. అ తీగెమట్టూ తిరిగి ఇటు వొచ్చింది ఆమె. సరిగా సినిమాలో మల్లే తిరుగుతున్నారు. పాట లేదు. అంతే భేదం.

చప్పున ఎదురు తిరిగింది.

నవ్వుతో అతని భుజాలమీద చేతులేసి వేడిమూతిమీద ముద్దు పెట్టుకుంది.

"ఛీ, చార్లెస్ ఎంగిలి."

అవును, అదీ సంగతి. అతని బాధ శబ్దరూపంలో వొస్తేనే గాని అతనికి అర్థంకాలేదు. అవును వొంటరిగా...ఆ రెండో కాలు కూడా ఆ పెట్టెలోకి ఎత్తి...సాయింత్రపు చీకట్లమూల—అతని సీటు వెనకాల-వుత్త ముద్దులేనా?

"ఆ ఎంగి లేదో ఇదివరకే అయింది. టీని రుచి చూడకుండానే పెట్టానా ఆ కుర్చీమీద?"

టీ కప్పును అమాంతం కింద వేసి కొట్టాడు. ఆమె తెల్లచీరె పసుప్పచ్చ అంచుమీద చింది ఇంకిపోయింది, టీ.

"అయిందా? ఇంకా వుందా కోపం?"

నవ్వుతూ తన భుజంచుట్టూ చెయ్యివేసింది.

"ఛో, సిగ్గులేని దానా!"

అని తోసేసాడు, నవీనప్రవక్తాఖ్యుడు.

"అబ్బా!" అంది వరూధినిమల్లేనే!

పింగాణీ పెంకు కాలుకింద ఎర్రనయింది. దుమ్ములోకి వొరిగింది, పాపం. పడకుండా పట్టుకున్నాడు, నడుంచుట్టూ చేతు లేసి.

ఆమె అతడి మెడ పట్టుకు వెళ్ళాడింది,

దొడ్లోకి మోసుకెళ్ళాడు.

"వాకిలి తలుపు వేసిరండి."

"బిందె?"

"దాను లోపల పెట్టండి."

బిందెనీ, చందమామనీ లోపల పెట్టి తలుపు గడియవేసి

నిమిషంలో వొచ్చి, కాలు కడిగి, తుడిచి, కట్టు కట్టాడు. ఆమె నవ్వు వింటే తన ఆదుర్దాకి సిగ్గు.

"ఇంక రా"

"ఎట్లా రాను? కాలు తెగిపోయిందిగా!"

"అంతమాత్రానికేనా?"

"అంతమాత్రానికే ఇంతకట్టు! కాలుమీదనే వాలికిపోయిందా మీ దయ కాస్తా?"

"లేదు. ఏం చెయ్యను చెప్పు."

"నన్ను లేవతీసి తీసుకు వెళ్ళండి."

చంకలకింద చేతులు కలిపి లేవతీశాడు ఆమెని. తన బరువు నంతా, సగుంపైన అతనిమీద జేరవేసి నడిచింది రెండడుగులు. బాధతోనిండిన ఆమెకళ్ళని మృదువుగా ముద్దుపెట్టుకున్నాడు. వాకిటి వేపు నడిచారు, బైట వెన్నెలకాంతి నీడలో నిండిన ఆ చీకటి గది లోంచి.

"ఇంటిదాకా నడవగలవా?"

"నన్నిట్లా తీసుకుపోగలరా?"

"ఆ"

"ధైర్యమే!"

వెక్కిరిస్తోంది. అతని చిన్న క్యాంప్‌కాట్ దగ్గిరిగా వెడుతు న్నారు. "అమ్మో!" అని బాధతో అరిచి దానిమీద పడిపోయింది ఆమె, ఆతిని మెడని ఉరివలె కావలించుకున్న చేతులతో, అతన్ని తనవెంట లాక్కుంటో గోడవేపు తిరిగి దిండులో తల దూర్చుకుంది.

"ఏమిటి? ఏమిటి? ఏమయింది?"

ఆమె నిలువునా వొణికిపోతోంది. కన్వల్షన్స్! ఏం చెయ్యాలి? లేవబోతున్నాడు. కాని ఆమె చెయ్యి అతని మెడచుట్టూ వేసిన ఉచ్చును మాత్రం వదలనే లేదు.

"ఏమిటి? ఏమిటి? నా ప్రాణం! ఏమిటి?"

ఇంకా దగ్గిరికి లాక్కుంది ఆమె చెయ్యి, తన పక్కనించి అతని ముఖాన్ని తన రొమ్ముపేపు. నవ్వుతోంది.

"నువ్వు! ఎంత టక్కరివి!"

• • •

చంద్రుడు చుట్టు తిరిగి ముందుకి వాలినంతా నీడ పడేశాడు. వాళ్ళు వొచ్చి బైట నుంచునేప్పటికి.

"వెడతాను."

"వుండు వొక్కనిమిషం కూచో."

ఆమె గుమ్మం మీద కూచుంది. అతను ఆమె పాదాల దగ్గిర కూచున్నాడు. దూరంగా బిందె ఏమీ ఎరగనట్టు చంద్రుడు కనపడని ఆకాశంవంక చూస్తోంది. చాలాసేపు అతను మాట్లాడలేదు. నిజమా అన్నట్టు ఆమె చేతులూ, తొడలూ, మెడా తాకి చూసుకుంటున్నాడు.

"ఇంక వెళ్ళనీ"

"చూడు, నేనేం చెప్పలేకపోతున్నాను. ఏం చెప్పినా నీకు అర్థమౌతుందో లేదో. నాకు నువ్వు—"

ఆగాడు.

"మాట్లాడకు. నాకు తెలుసు."

"ఎట్లా?"

"ఎట్లా నెతేనేం? తెలుసు కాని, నేను చెప్పేది విను."

"చెప్పనక్కర్లేదు. వినను."

"వినాలి, తప్పదు."

"ఏమీ వినను. పద."

"వినాలి. చాలా ముఖ్యం. ఇంతే. రేపు పొద్దున్ననుంచి నన్ను నువ్వు ఎరగవు. నిన్ను నే నెరగను" అంది ఆమె.

"అదేమిటి?"

"ఏమీ అడక్కు; అంతే."

"నిజమా?"

"నిజమే."

"ఎందు కట్లా?"

"అంతే గనక."

"నే నేమైనా...."

“ఏంలేదు నువ్వు....”

గుమ్మంనించి జారి అతన్ని రొమ్ము మీద తల పెట్టి కావిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

“అంతేలే” అంది చప్పున. మబ్బులేని ఆ వాన నిమిషంలో మాయమయింది.

“నా ప్రాణం ఇస్తాను నీకు. అదే నేను చెప్పాలనుకుంది” అన్నాడు.

“నీ పాదాలుపట్టి నిన్ను వేడుకుంటాను, నన్ను మరిచిపో.”

“ఇంక కనపడవా?”

“కనబడక ఏమౌతాను?”

“ఐతే నే నూరుకోను.”

“వూరుకుని తీరాలి.”

“చూస్తాను కదూ! నిన్ను ఇప్పణ్ణించీ వెళ్ళనీను.”

అని నించున్న ఆమెని కౌగలించుకున్నాడు. ఆమె గట్టిగా కావిలించుకుంది. కళ్ళు తెరిచేటప్పటికి ఆమె లేదు. బిందె మాత్రం వుండిపోయింది, ఆ వింత సంఘటనకి సాక్షిగా.

అట్లా వాకిట్లో కూచుని ఆలోచిస్తో ఎప్పుడు నిద్రపోయినాడో సూర్యారావు, కళ్ళు తెరిచేటప్పటికి చాలా పొద్దెక్కింది. బిందె లేదు. రాత్రి తలుపు గడియ వెయ్యడం కూడా మరిచిపోయినాడు గావును.

మర్నాడు సాయంత్రం: నున్నని ఇనపకడ్డీల్ని వెండి కింద మార్చే సాయంత్రం, వెన్నెలలో పంపు దగ్గిరికి నడిచాడు. నీళ్లుపట్టుకుని అప్పటికే వెళ్ళిపోతోంది ఆమె. కొంచెం ధైర్యం చేసి అటే నడిచాడు తను కూడా. అతనికి నమ్మకం రావటంలేదు, నిజంగా ఆమె మాట్లాడదని. బిందె బరువుతో జారుకున్న నడుముని చూస్తో మళ్లీ ఆ నడుము కిందనించి చేతులు పోనిచ్చి తన దగ్గిరికి లాక్కోకుండా ఎట్లా బ్రతకగలడు? అనేదే ప్రశ్న.

“నన్నెరగరని చెప్పలేదూ? వెళ్ళండి, వెళ్ళండి. ఇంక రాకండి.”

“నువ్వెవరో, నీ భయ మేమిటో చెప్పాలి.”

"నే నేం చెప్పను? నేను రాను. మీరు వెళ్ళిపొండి. చెపుతోంచే మనిషి కాదూ?"

"ఎవర్నన్నా అడుగుతాను, ఈ సంగతి."

"కానీండి. ఎవరన్నా చెపుతారు. ఇంక పొండి. నా వెంట రావొద్దు."

"వీల్లేదు. నీ యింటిదాకా వస్తాను."

"నా ఇంటికా! దేవుడా! ఇదేం పోరు! ఫో. నా మొగుడూ, నా సంసారం, పిల్లలూ....ఇదేం గొడవ తెచ్చిపెట్టుకున్నాను?"

"నేను వెళ్ళను."

"ఆగింది ఆమె.

"నేను అరుస్తాను; వెళ్లు" అని భయంతో చుట్టూ చూపింది.

వాళ్ళు ఈతచెట్ల వెనకగా వున్నారు. వాటిని దాటారంటే పూరిఇళ్ళు కనబడతాయి.

"నేను వెళ్ళను" అని బుజం పట్టుకున్నాడు.

"రా, నాతో రా ఇప్పుడు" అన్నాడు.

ఆమె చప్పున బూతులు ప్రారంభించింది. మొగాడికి ములుకుల మల్లె గుచ్చుకునేవి. నివ్వెరపోయి చూశాడు అతను. తిడుతోంది. వుమ్మేసింది.

"ఇంక ఒక్క అడుగు కదిలావా అందరిముందు నీ మొహాన ఉమ్మేస్తాను. ఫో."

అని చరచరా వెళ్ళిపోయింది.

ఏమీ అర్థంకాక, తన చెవుల్ని నమ్మలేక, అసహ్యపడి మళ్ళీ అసహ్యాన్ని నిలుపుకోలేక, ఇంటికి వెళ్లాడు. నిండారు వెన్నెల, రక్తాన్ని పిలిచి పలికించే దక్షిణపుగాలి. ఎటు చూపినా ఆమె అందం, ఆ రాత్రి—ఆమె తనని ఎంత కాక్షతో తీసుకుంది! స్త్రీ ఆ విధంగా కోరి సంతోషించడం పుస్తకాల్లో కూడా చదవలేదు అతను. అసలు వుంటుందని అనుకోలేదు. ఏం చెయ్యాలి? ఆమె తన రక్తంలోకి ఎక్కింది. వదలదు. చీకటిపడ్డాక ఎత్తుకువస్తే బలవంతంగా! ఆమె ఇల్లు తెలుసుకుని వెడితే! ఆమె తిట్టిన పాడు తిట్లు సులభంగా మర్చి

పోయినాడు. మర్చిపోకపోతే ఏ పురుషుడు ఏ స్త్రీతో కాపరం చెయ్య గలడు?

మర్నాడు సాయంత్రం దూరంగా పంపు దగ్గర ఆమెని చూపించి పోర్టర్ని అడిగాడు, ఆమె ఎవరని?

"అదా? తప్పుడుముండ" అని ఇంకా రెండు తిట్టాడు.

"ఆమె ఎవరు చెప్పు."

"నా మాట వినండి. శుభ్రంగా పెళ్ళి చేసుకుని ఓ అమ్మగార్ని తీసుకురండి. ఈ పాడుముండల జోలికి పోయి చెడిపోకండి" అన్నాడు.

ఎవర్ని పలకరించినా నీతిబోధ చేసేవారే కదా!

కాని ఆ పంపుదగ్గర నీళ్ళు పట్టుకుంటో వయ్యారంగా, కళ్ళు పైకెత్తి, ఎవరి లక్ష్యమూ లేకుండా ఆకాశనీలాన్ని గమనించే ఆమెలో దోషం అతని హృదయం నమ్మ నంది. ఆ రాత్రి ఆమె రొమ్ము— ఆమె మాట—ఆమె తీరు—తన మీది దయ—అమెనా ఈ మాటలు పీడు?

రెండు రోజుల్లో మళ్ళీ చార్లెసు గుడ్సుట్రైలు వచ్చింది. తనుచూసే టప్పటికే ట్రైలు కదలబోతోంది. చివరి నిమిషంలో నవ్వుతో అతని పెట్టెలోంచి దూకింది ఆమె, ట్రైలు వెడుతో గార్డుపెట్టి దగ్గిరికి రాగానే ఛార్లెస్ సూర్యారావుతో —

"ఆ అమ్మాయి సంగతి వదిలెయ్యి బ్రదర్. అటు పోకు" అన్నాడు.

"వీడి సొమ్ము గావును ఆ అమ్మాయి! దొంగవెధవ. నీతి చెపుతున్నాడు" అనుకున్నాడు. వీడు కూడా నీతిబోధలేనా?

ఇంటోకి వెళ్ళాడు. టీ మీది బుద్ధిలేదు. ఇంకా చంద్రుడు ఉదయించలేదు. అగ్గిపెట్టెకోసం కోటుజేబు దగ్గిరికి వెళ్ళాడు. వెనక నించి చీకట్లోంచి కావలించుకుంది ఆమె.

"నీ దిగులుని భరించలేక వచ్చాను. పది నిమిషాలు రా.... కోపమే? తిట్టాననా? తిడితేగాని పోవుకదా! ఏం చెయ్యను?" అంది దిగులుగా, లాగుతోంది బుజాలు పట్టుకుని.

"ఫో, నన్ను ముట్టుకోకు" అని పెద్ద బూతు విసిరాడు, ఆమెని తోసేశాడు. ఆమె కదలక నుంచుంది. ఏడుస్తోందా? అతని కోపాన్ని తుడుస్తున్నట్టు దగ్గిరికి వచ్చి చంపలమీద చేతులు వేసి,

"నీ దాన్నికదూ! నీ కోసమే. నీ కోసమే. నమ్ము. రా రా. దగ్గిరికి రా. వెళ్ళిపోవాలి. రా."

"ఎట్లా తప్పించుకుంటాడు ఆ కౌగిలిలోంచి? ఏమైనా అట్లాంటి కౌగిలి జన్మలో ఎప్పుడో ఏ అదృష్టంవల్లనో గాని లభ్యం కాదని తెలుసు అతనికి, పసిబాలుడు కాదు.

మాట్లాడకుండా దగ్గిరికి తీసుకున్నాడు ఆమెని. ఆమె ఎంత తొందరపడ్డా వెళ్ళడం పది నిమిషాలల్లా అరగంట దాటింది. మంచి యవ్వనంలో, ఒకరి కొకరు ఎదురుపలికే రక్తాలతో కాలం అనేది కొలత లేదు వాళ్ళకి.

తలుపుతెరిచి ఇటూ అటూ చూసి చల్లగా జారిపోయింది, ఆమె చీకట్లోకి. ఆమె వెళ్ళిన దిక్కున చూస్తూ నుంచున్నాడు. హోటలుకి వెళ్లాలి. కాని ఇప్పు దేం తొందర? గడిచిన అరగంట అద్భుతాన్ని నిదానంగా తీరికగా నెమరు వేస్తో, అట్లానే ఉండి పోయినాడు.

అతని వీపు వెనక పిల్లిమల్లే దగ్గిరికి జరుగుతున్న ఆకారాన్ని గమనించాడా? మెల్లిగా చెయ్యిఎత్తి అతని మెడ చుట్టూచెయ్యేసి,

"ఈసారి దానికేసి కన్నెత్తావా—చచ్చావే"

అనడం, అతని నెత్తిమీద గట్టిగా కొట్టడం ఒక్కసారే జరిగాయి. ఆ సూర్యారావు వేసిన కేకకూడా బిగ్గిరిగా రాలేదు. ఆ ఆకారం అట్లానే చీకట్లోకి పోయింది.

అతని చిన్న కేకకే చుట్టుపక్కవాళ్ళు వొచ్చినట్టున్నారు. తెల్లారి కళ్లు తెరిచేప్పటికి ఆస్పత్రిలో వున్నాడు.

పాపం, ఆమె ఇందుకు గావును తనని అంత భయపడి జాగ్రత్త పరిచింది.

సూర్యారావు రైల్వేలో చేరా డన్నమాటేగాని, అతను చాలా పాప్యులర్. అతని మిత్ర బృందంలో కాలేజీలో చదివిన ఏణ్నర్థంలో

గొప్ప పుట్ బాల్ ఆటగాడు. అతని ఆట మిత్రులు రౌడీలూ, వాస్తాదులూ అతనికి ప్రాణ మిస్తారు. ఆ రోజే ఒకతనికి ఉత్తరం రాశాడు. మూడో రోజుకి ముగ్గురు దిగారు. వాళ్ళతో ఏమీ చెప్పలేదుగాని, తనకి నయ మయిందాకా వుండ మన్నాడు. అంతకన్నవాళ్ళు చేసేపని వాళ్ళకేం లేదు గనక వుండిపోయినారు. పైగా సూర్యారావుమీద చాలా ప్రేమ వాళ్ళకి. అతన్ని ఎవరో కొట్టారని తెలుస్తోనేవుంది. వాళ్ళు మర్యాదస్తులు కారు—తియ్యని కబుర్లు చెప్పి,ఏదో చెడ్డ వ్యవహారంలో ఇరుకున్నాడని గ్రహించి, అర్జెంటు పనులమీద తప్పుకుని పోవడానికి అతన్ని ఆ కథ ఏమిటో చెప్పమంటున్నారు గాని, అతనే ఆలస్యం చేస్తున్నాడు.

అతను ఆస్పత్రిలో చేరింది మొదలు ఎవరో కుర్రాడు అతనికి తెలీకుండా అతని స్థితిని రోజుకి నాలుగైదుసార్లు తెలుసుకుని పోతూనే ఉన్నాడు. మూడోనాడు జరం తగ్గగానే, భోజనంలోకి మాసంకూరా పళ్లూ పంపారు, అతనికి తెలీని బంధువులు ఎవరో. అతనికి ఎక్కడా అంత దయగల బంధువులు లేనే లేరు. ఇంత జరిగినా, ఆ కూర పంపిన వారిని ఒక్కసారి చూడాలనే కాంక్ష అతన్ని వొదలటంలేదు.

ఆ కూర ప్రతిపూటా వొస్తూంది. కూర తెచ్చిన అతన్ని పట్టుకుని తన దగ్గిరికి తీసుకురమ్మని మిత్రులతో చెప్పి వుంచాడు. రాత్రి ఓ కుర్రాణి బలవంతంగా లాక్కొచ్చారు.

"ఎవరు పంపుతున్నారు కూర?"

"అక్క."

"ఎవరు మీ అక్క?"

"మా అక్క."

"ఎక్కడ వుంటుంది మీ అక్క?"

"వాళ్ళ ఇంట్లో."

"ఎందుకు పంపుతోంది?"

"మీరు మా బంధువులుగా!"

"మీ అక్కని ఓసారి రమ్మను."

"జరంగా వుంది."

"నయం లేదా? మందు తీసుకుంటోందా!"
"కొంచెం నయంగానే ఉంది."
"ఎవరిస్తున్నారు మందు?"
"మందులేదు ఏమీలేదు."
"ఏమి?"
"నేను తెచ్చిపెడతానంటే ఒద్దంది."
"మీ బావా?"
"మా బావ ఎవరు?"
"మీ అక్కకి మొగుడు లేడా?"
"లేడు."
"ఎవ రున్నారు?"
"నేనే."
ఇం కే మడగాలో తెలీలేదు సూర్యారావుకి.
మరి ఎవరు తన తల పగలగొట్టింది!
అతని స్నేహితులు వూరుకోలేదు. వూళ్లో బోగట్టా వేసి ఒచ్చారు.
ఆమె క్రిస్టియన్ అమ్మాయి. పేరు లిల్లీ. ఆమె ఒక గార్డు కూతురు. భర్తకీ రైల్లో పనే. రెండేళ్ళ కిందట రైలుకిందపడి చచ్చిపోయినాడు. ఆనాటినుంచి ఖాదరనే రౌడీ ఆమెని వుంచుకున్నాడు.
అంతవరకు సూర్యారావుతో చెప్పారు వాళ్ళు. ఇంకేమీ చెప్పవద్దని నిశ్చయించుకున్నారు. ఖాదరే సూర్యారావుని కొట్టి వుంటాడని వాళ్ళ అభిప్రాయం.
మర్నాడు రాత్రి ఎనిమిదింటికి లిల్లీ అతనికి కూరా, పిండి వంటలా తనే తెచ్చింది. ముగ్గురు మిత్రులూ అప్పుడు అతని దగ్గరే కూచుని ఉన్నారు. కాని ఆమె వాళ్ళని చూసినట్టే లేదు. ఒక్క నిమిషం అతని వంక చూస్తూ మంచుని తనని తను ఆపుకోలేక బిగ్గరగా ఏడుస్తూ అతనిమీద పడ్డది.
"కన్నా, కన్నా చచ్చి బతికావా? నాకోసం ఇంత దెబ్బ తిన్నావా? నా మూలానేఇట్లా ఐపోయావా!" అంటూ.
మిత్రులు లేచారు వెళ్ళాలని.

"వుండండి, వుండండి. వీళ్ళు మనవాళ్లేనా?" అంది సూర్యారావుతో. ఆమె దుఃఖం చూసి ఏడుపు వొస్తున్న సూర్యారావు అవునని తలవూపించాడు. ఆమె చాలాసేపు మాట్లాడలేదు.

ఆమె మెళ్లో ఉన్న ఒక్క పూసలహారాన్ని సర్దుతో ఆమె రొమ్ముమంచి చూపు తిప్పుకోలేకపోయినాడు సూర్యారావు.

"నే నింక వెళతాను."

"కాదు. ఏమిటి ఇదంతా? నీకు మొగుడు వున్నాడా?"

అతనేనా ఇంత రౌడీ?

"నన్నేం అడక్కు, నా మాట విని...."

అని ఆ ముగ్గురివేపు తిరిగి,

"ఇతన్ని తీసుకుపొండి, ఈ ఊరినించి, ఇక్కడ ఉంటే...."

"ఉంటే?"

"నన్ను చూడకుండా వుండలేడు ఈయన! ఆయన చంపేస్తాడు ఈయన్ని, ఈసారి గుర్తులేకుండా."

అని చప్పున లేచి వెళ్ళిపోతోంది. ఆ ముగ్గురూ ఫుట్‌బాల్ యోధులు. దాంట్లో పొడుగాటి మనిషి జాషువా ఊచున్న పీటనించే తలుపుకి సునాయాసంగా కాలు జాచాడు. ఆమె ముందుకి పడబోయింది. పడకుండా ఆమె చేతిని పట్టుకుని వెనక్కి లాగాడు. ఆమె బాధతో అరిచింది.

లేచి ఆమె చేతిని చూశాడు. ఆమె మాట్లాడకుండా తల వొంచుకుని నిలుచుంది. చెయ్యి మోచేతి దగ్గర విరిగి వుంది. అంతా వాచింది.

"చూడరా సూర్యారావ్! చూడు. ఆ ఖాదరేనా విరిచింది?"

ఎంత అడిగినా మాట్లాడినా మాట్లాడదు.

చివరికి సూర్యారావు లేచివచ్చి ఆమెని బతిమాలినా ఒక్క మాట మాట్లాడలేదు.

"ఎందుకు మాట్లాడవు? మేం వున్నాం. చెప్పు నీసంగతిమాతో."

"మీకు తెలీదండీ, ఈయన్ని తీసుకుని వెళ్ళిపొండి" అంది.

"ఏమిటి తెలీదు మాకు? బూకరించకు. మేం తీసుకు పోము. మాకేం?"

లిల్లీ సూర్యారావు దగ్గిరికి వెళ్ళి పక్కమీద కూచుంది.

"వెళ్ళరా? నా మాట విని వెళ్ళిపోరా?"

"సరేలే. ముందు నీ చెయ్యి చూపించు. విరిచేశాడా? విరిచేశాడా? ఎందుకు?"

"అడుగుతారా?"

"అయ్యో! ఎట్లా భరించను? ఇంక నువ్వు వెళ్ళకు ఇంటికి. ఒరేయ్ మీరు లిల్లీని మన ఇంటో పెట్టి రక్షించండిరా." అనేప్పటికి ముగ్గురూ నవ్వారు.

పై సంభాషణ జరుగుతోవుంటే వాళ్ళు ముగ్గురూ మధ్య మధ్య,

"కుయ్ కుయ్."

"అయ్యో. అయ్యో"

"చుప్, చుప్."

"ఆహా. ఆహా!"

"వాన్సుమోల్"

ఇట్లా అంటున్నారుగాని లేకపోతే సంభాషణ ఇంకా విచారకరంగా నడిచి వుండేది.

"ఏమిట్రా? దాన్ని ఎవరూ రక్షించక్కర్లేదు. దాన్నించి నీబోటి వాళ్ళని రక్షించాలి."

"ఏమందోయ్, జాగర్త. మీకు తెలీదు ఈయనకి కలగబొయ్యే ఆపద" అంది కోపంగా లిల్లీ.

ఇంతవరకూ ఓ మూల కదలకండా కూచుని చిన్న చిన్న శబ్దాలు చేస్తున్న సుబ్బారావు, వాళ్ళు ముగ్గురిలో పొట్టి మనిషి, సిగరెట్ని కింద పారేసి లేచి నుంచున్నాడు.

"ఏమిటి మహా గొప్పలు మాట్లాడుతున్నావు? నిన్ను ఉంచుకున్నంత మాత్రాన వా దెవడో కలియుగ బకాసురుడైనట్టూ, నలకూబరుడైనట్టూ మాట్లాడుతున్నావు? వాడు చేసిన మహా కార్యాలు, చీకట్లో వెనకాలగా వొచ్చి నెత్తిమీద కొట్టడమూనూ. ఆడముండ చెయ్యి విరవడమూనా! మంచిపని చేశాడు? కావలసిందేలే నీకు. మేం ముగ్గుర మెందుకు? ఎదురుగా వొస్తే మా సూర్యారావే వాడి డొక్క చించి

పెట్టేవాడు. నీ వెంటబడి మతిపోయింది గాని వాణ్ణి ఓ మానవ మాత్రుడు కొడతాడా? మా వాణ్ణి ఎందుకు తీసుకుపోవాలి? ఏమీ తీసుకుపోము. నరికి పారేస్తాం. జాగర్త అని చెప్పు ఆ తప్పుడు గాడిదతో తెలిసిందా? నీ వెంటపడ్డ ఈ వూరి చచ్చుపీనిగల్ని ఇద్దర్ని తన్నాడుగావును ఆ మహా యోధుడు! అంతకన్న గజకర్ణుడు లేడను కుంటున్నావు. కనుక్కున్నాంలే వ్యవహారం! వాణ్ని అట్టే వెనకవేసు కొచ్చావంటే నిన్నూ తంతాం జాగర్త. ఏమిటో మావాట్ట, తనని చూడకుండా ఉండలేట్ట, ఎందుకు వుండలేడూ? నువ్వేం రంభవా, దమయంతివా? పద, పద. మహ గొప్పగా ఉంది. ఇటూ అటూ రెండు తింతే సరి. ఎందుకు చూడకుండా ఉండలేడూ? ఏంరా సూర్యారావ్? చూడకుండా ఉండలేవా? నిన్నూ తంతే సరి నాలుగు! ఏం ఆడవాళ్ళు లేరా ఇంక? ఇదేనా మొనకత్తె! ఏముందే విశేషం నీ దగ్గర?...." ఇంకా ఏముందో పరీక్షలోకి వెళ్ళబోతో ఉంటే తప్పించుకు పారి పోయింది లిల్లీ. ముగ్గురూ పకపక నవ్వారు. అలిసి గావును గోడవేపు తిరిగి పండుకున్నాడు సూర్యారావు.

ఖాదర్ని ఆ రాత్రే తన్నాలని నిశ్చయించుకున్నారు వాళ్ళు, కనపడితే లిల్లీని కూడా. చప్పున సూర్యారావు వాళ్ళవేపు తిరిగి,

"మీకేం బుద్ధిలేదా? దాన్నెందుకురా?" అన్నాడు.

"బతికే వున్నావా? మీ ముగ్గురి అంత్యక్రియలూ ఓసారే చేసి పోదామనుకున్నా. ఏమిట్రా, ఎందుకు తన్నకూడదూ దాన్ని?"

"అదేం చేసిందిరా?"

నవ్వాడు సుబ్బారావు ఆస్పత్రి అదిరేట్లు!

"అదేం చేసిందిట! ఆ పక్కమీద కూచుని అడుగుతున్నాడు చూడు!"

"ఈవూ రొచ్చి వీడికి మతి పోయిందిరా!"

"అడదిరా."

"అదేం చేసిందా విను. ఏం చెయ్యాలి? ఇట్లాంటి ఆడవాళ్ల పబ్లిక్ మెనెస్. ఏమిట్రా వీళ్ళు! ఊరికే నడుస్తారా తోవ వెంబడి అందరికిమల్లే! పిర్రలు ఊపుతారు. ఇటూ అటూ కళ్ళల్లోంచి పక్క

చూపులు విసురుతారు. జడని ఇటూ అటూ పంది తోకమల్లె గిరాటేస్తారు. మెడని నాజూకుగా తిప్పుతారు. చిన్న చిన్న నవ్వులు నిష్కారణంగా నవ్వుతారు. ఇంక మన సూర్యారావు వంటి బుద్ధిలేని కుక్కలు కయ్ కయ్ మని వెంటబడి, తగూలాడుకుని ఆస్పత్రి చేరుకుంటారు. దెబ్బలతోనో, రోగాలతోనో!" అన్నాడు సాంబం.

"ఒరే, కవులే ఈ దొంగ బోకిళ్ళని వర్ణిస్తారు కదా! నవ్వితేట, పువ్వులు రాలాయట! ఎండకే మెరుగు పెట్టినట్టుందట. ఆ నడకని చూసి హంసలూ ఏనుగులూ సిగ్గుపడతాయిట, తోవ పొడుగునా ప్రేమ ప్రవంతి ప్రవహిస్తుందిట. మాటలో కోకిల స్వరాలుట!"

"ఆ కవులు రాయడమేగాని వాళ్ళలో ఒక్కడూ ఆడవాళ్ళ జోలికి పోడు, తంతారని భయం. సూర్యారావు వంటివాళ్ళు ఆ పత్రికలు కొని చదివి ఆ మాటలన్నీ నిజ మనుకుని...."

"ఏంరా? ఆ చలం పుస్తకాలు చదువుతున్నావా ఏంటి?"

"ఎవడో కవిరా...."

ఏనాడు నీమోవి
లేనవ్వు పొలుచునో
నీ ప్రొద్దు పొడుపులో
నీ ప్రేమ మొలుచునో....

అన్నాడురా!"

"ఒరే సూర్యారావు! ప్రేమ మొలవడ మేమిట్రా?"

"వాడి తల మీద గుంటపడ్డదా! ఇంక దాంటోంచి ప్రేమ మొలవడమే తరవాయి."

"ప్రేమ మొలుస్తుందో, ఏం మొలుస్తుందో!"

"ఒరే. ఈ ముండ మూలానే కదూ, నువ్వు దెబ్బలు తిని హాస్పటల్‌కు చేరింది?"

"దాన్నేమనకండి. దానికోసం దెబ్బలు తినటమే కాదు, చచ్చిపోయినా పరవాలేదు" అన్నాడు సూర్యారావు.

"దానికోసమేనా? ఏ ఆడదాని కోసమైనా సరేనంటావా?"

"దానికోసం "

"ఏమిటా విశేషం?"
"అది దేవత!"
"ఎట్లా?"
"అంతా-రూపంలో, మనసులో, సూనృతంలో."
"దేవతలంటే ఇట్లానే వుంటారంటావా?"
"ఈ గ్రామదేవతా?"
"నువ్వు దేవుడివని ఆ దేవత నిన్ను చేరింది?"
"నిన్ను తన్నిం దెవరు? గంధర్వులా?"

ఈ విధంగా అర్థరాత్రి దాకా వాగారు. సూర్యారావు తను లేచిందాకా ఖాదర్ని కొట్టకుండా ఆగమని వాళ్ళని బలవంతం మీద వొప్పించాడు.

మర్నాటి రాత్రినించి ఎప్పుడో ఒకప్పుడు ఆ ముగ్గురూ లేని సమయంలో లిల్లీ వచ్చి సూర్యారావు దగ్గిర కూచుని అతన్ని ముద్దు చేసి పోతోనేవుంది, వాళ్ళు ఎంత వెక్కిరించనీ, తిట్టనీ ఆమె దగ్గిరికి వచ్చిందంటే, సూర్యారావు ఆమె కళ్ళవంక చూసీ, వేళ్ళను తాకి ఆమె మాటల మార్దవంలో కరిగిపోయి, 'ఇంక అంతకన్న స్వర్గం ఏముంది?' అని అనుకోడం మానలేదు. ఆ ఖాదర్ని వొదిలి తనతో వుండమంటాడు. దానికి లిల్లీ ఓసారి నవ్వుతుంది. ఓసారి భయపడు తుంది, ఓసారి ఏడుస్తుంది.

"నామీద నీకు నమ్మకం లేదా? ఆ ఖాదరేం చేస్తాడు? వాణ్ణి ఇంక ఎందుకు పనికిరాకుండా చేసే మాట్లాడతాం వీతో" అన్నాడు.

"వద్దు, నా మీద వొట్టు; అతన్నేం చేయకండి."
"అతని మీద ప్రేమా నీకు?"
"లేదు."
"నా మీద ప్రేమా?"
"ఊ"
"మరి ఇంకెందుకు?"
"అందుకనే" అంటుంది.

ఆ మాటలకి అర్థం తెలీక ఏమిటో తనకి కనపడని వలలో

ఇరుక్కున్నట్టు కొట్టుకుంటాడు సూర్యారావు. ఆమె మాటల అర్థం వెదుకుతాడు. ఎందుకు స్పష్టం చెయ్యదూ? ఆడవాళ్లు అంతేగావును.

"ఏమన్నా వుంటేగా స్పష్టం చెయ్యడానికి?" అంటాడు సుబ్బారావు.

"స్పష్టం చేస్తే ఏముందిరా వాళ్ళ వంట్లోగాని, బుర్రలోగాని! అట్లా అందమైన మిస్టరీలో కప్పివుంచబట్టే, ఆ చీరే అంత షోకుగా వుందే—దాని కిందది ఇంకా ఎంత షోకుగా వుంటుందో, ఆ నున్నని మెరిసే జుట్టే అంత అందమే—దాని కింది బుర్రలో ఎంత అందమైన తెలివి ఉందోనని భ్రమసిపోతాడు మొగవాడు."

అని నవ్వుతారు అతని మిత్రులు.

"ఇంతకీ ఏమంటుందిరా నీ లిల్లీ?"

"ఏమంటుంది? తానూ నిజమైన లిల్లీనే అనుకుని ఏమెరగనట్టు అటూ ఇటూ తిప్పుకుని నవ్వుతోవుంటుంది, బురద మధ్య" అన్నాడు జాఘవా.

"ఇక్కడేం బురదలేదు. వొచ్చి నన్ను కోసుకోండి అని ప్రతీ వాళ్ళనీ దొంగపిలుపులు పిలుస్తూ" అన్నాడు సుబ్బారావు.

"ఆ ఖాదర్ని కొట్టవద్దట" అన్నాడు సూర్యారావు.

"ఇంకా?"

"నన్ను వొదలలేదుట."

"చూశారా? ఖాదర్ని ఏం చెయ్యకూడదు. వీణ్ని వొదలదు అది. వీణ్ని వాడూ, వాణ్ని వీడూ నరుక్కుంటూవుంటే కులాసాగా కూచుని చూస్తూ వుంటుంది. లేకపోతే తన కేం తోస్తుంది? ఛీ లేవండిరా, పోదాం" అన్నాడు సాంబం.

"మనవా దేమంటాడో కనుక్కో" అన్నాడు సూబ్బారావు.

"వాణ్ని అడిగి లాభంలా. పదండి. మనం చేసేది చేద్దాం."

"ఉండండిరా. ఎల్లుండి వెళ్ళిపోతున్నాంగా ఇంటికి. ఒక్క ఒక్కరోజు ఓపికపట్టండి" అన్నాడు సూర్యారావు.

"శనివారం సికింద్రాబాదులో ఫుట్‌బాల్ మేచ్ వుంది, మేం పోవాలి. మవ్వా రా. ఈ వెధవ రైళ్ళఉద్యోగ మేమిట్రా నీకు? ఆ

నాలుగు ఎకరాల పొలం తగలేసుకున్నావుగాని లేకపోతే నువ్వా హాయిగా ఫుట్ బాల్ ఆడుకుంటో తిరిగేవాడివా? కానీ ఎల్లుండిదాకా వాయిదా?"

"ఇదంతా ఈ కవిత్వమూ, సినిమాలూ చేస్తున్న పని."

"మేం ఆడవాళ్ళ నెరగమనుకోకు. ఆడవాళ్ళ కేమిట్రా! కావలసినంతమంది. కాని ఆ ఒక్కతే కావాలని ఈ ఏడుపేమిటి? వీడి ఏడుపుతో అదెంత బెట్టు చేస్తుందో తెలుసా? అందరికీ అది సులభమే, ఈ కవిత్వం బుర్రలో పెంచుకునే వాడిదగ్గిరే దానిగొప్ప."

"వీడే దాన్ని ఆడది అనడురా. దాన్ని దేవత అంటాడు. అన గానే అది అందని అపురూపరంభగా నటిస్తుంది."

"ఆ సినిమాల్లో చూడు. తెరమీద అందరు ఆడవాళ్ళు గుంపులు గుంపులుగా వస్తారా? ఎవ తైనా బాగానే ఉంటుంది. కాని ఆ యోధుడు వున్నాడే, ఆ వంకరనాయికి మాత్రమే కావాలని మూడుగంటలసేపు పడరాని అగచాట్లన్నీ పడతాడు, పాడతాడు. వీడి అగచాట్లు చూసి అందరూ అడ్డుపడతారు సరదాకి. తండ్రి వీళ్లే దంటాడు. ఆ అమ్మాయి పారిపోతుంది. దొంగలు కూడా ఎత్తుకు పోతారు. పాములు కరుస్తాయి."

"పాములేమిటి, కప్పలు కూడా కరుస్తాయి."

"ఆడదాన్ని అంతగా గొప్పచేసుకునేవాణ్ని చూ స్తే అందరికీ కోపమే! అసహ్యమే! ఆ పెళ్ళికూతురికీ అనుమానమే. వీడి పాటలూ కులుకులూ చూ స్తే, అటూ ఇటూ రెండు తన్ని దాన్ని తీసుకుపోక."

"తన్నగలిగినవాడు ఆ పాటలు పాడుకుంటో ఎందుకు తిరుగు తాడురా?"

"ఆ రతన్ చూశావా? దానికి వేరే పెళ్ళి సంబంధం కుదిర్చిం దాకా అట్లా చూస్తూ వూరుకుంటాడు. ముందుగానే ఆ బండీలో వేసి తీసుకుపోతే ఏ గొడవా వుండేదికాదు. పెళ్లి కానిచ్చి ఓ మూలకిపోయి లోకంలో తన కెవరూ లేరని ఏడుస్తాడు."

"ఆ పెళ్ళి అవుతోంటే, అప్పుడు వెళ్ళడు. పెళ్ళి కానిచ్చి తరువాత ఏడుపు ప్రారంభిస్తాడు."

"కొందరికి ఏడుపంటే, చావంటే ఇష్టంలాగుంది. మన సూర్యారావూ ఆ జట్టులో వాడులాగే వున్నాడు.

"ఒరే సూర్యారావ్, పోనీ సినిమాల్లో చేరరాదురా నువ్వు?"

"వారే నోరు ముస్తారా? లేచి తన్ననా? ఇంక పొండి, నిద్ర వస్తోంది. ఎల్లుండిదాకా వాయిదా."

అంతటితో నవ్వుకుంటో లేచిపోయినారు వాళ్ళు.

ఆ ఎల్లుండి వొచ్చేప్పటికి ఎవరి ప్రయత్నం లేకుండానే వ్యవహారం దానంతట అదే తీరిపోయింది.

ఆ మధ్యాన్నం ఆస్పత్రినించి డిశ్చార్జి ఐన సూర్యారావుని ఇంటికి తీసుకుపోయినారు.

ఆ రాత్రి బైలుదేరి ఖాదర్ని తన్నడం డిస్కస్ చేసుకుంటున్నారు. ఆ లిల్లీ ఇంటికిపోయి ఇద్దర్నీ ఓసారే కలుసుకోవాలని వాళ్ళ ఉద్దేశ్యం. ఇంతలో తలుపు తెరుచుకుని బూచివాడిలాగు ఒక లాటితో వాళ్ళముందు సాక్షాత్కరించాడు ఖాదర్. నిలుగుతూ గోడలకి జార్లబడి వున్నవాళ్ళు కాస్తా ఆ లాంతరు గుడ్డి చీకట్లలో భయంకర రూపాన్ని చూస్తూ వుండిపోయినారు.

"ఎవడ్రా నన్ను తంతానంటున్నాట్ట.... (బూతులు) తన్నండిరా. వరికి ఇక్కడే పాతేస్తా" అంటూ వాళ్ళవంక చుట్టూ చూశాడు.

"ఎవడ్రా నువ్వు?" అన్నాడు సాంబం.

"నీ అక్క మొగుణ్ణిరా" అని లాఠీ ఎత్తాడు. వాడి కాళ్ళ సందుకు ఒక్క దూకులో పాకాడు సుబ్బారావు. ఖాదర్ బోర్ల బొక్కలా పడ్డాడు సూర్యారావుమీద. రెండు నిమిషాల్లో లాఠీ లాగెయ్యటం, ఖాదర్ దవడమీద నాలుగు గట్టివి—ఇంక రెండు నెలల వరకు ఆ దవడ పనిచెయ్యకుండా—ఇచ్చుకోవడం జరిగింది. మళ్ళీ ముగ్గురూ ఎవరి స్థానాల్లో వాళ్ళు గోడ నానుకుని కూచున్నారు. తన దెబ్బలకి నర్సింగ్ చేసుకుంటో కూలబడి వున్నాడు ఖాదర్. అప్పుడే మొహం వికృతంగా వాచుకొస్తూంది.

"చూసుకోండి. అప్పుడే అయిందీ మీ పని? రేపు తీసుకొస్తా మా వాళ్ళని" అంటున్నాడు.

"ఏడిశావులే. రేపటిదాకా నువ్వు బతికివుంటే కద మీ వాళ్ళని తీసుకురావడం?"

"నీకు మూడు నెలలవరకూ మాటవొస్తేకద ఎవరితోనన్నా చెప్పుకునేందుకు?"

"నీ సంగతి మాకు తెలుసులేరా ఖాదర్. నీకు నీవాళ్ళనేవా ళ్ళుంటే వాళ్ళిదివరకే బాగా బుద్ధిచెప్పేవాళ్ళు నీకు. ఈ కోమట్ల ముందు బాబుగా వొస్తాదునని దడిపించి తిరిగావు ఇన్నాళ్లూ. ఈనాడు నీ మొగుళ్ళు దిగారు ఈ వూరు. మహా వొస్తాదువిరా చీకట్లో మనిషిని కొట్టడానికి. సిగ్గులేదురా!"

"నా పిల్లజోలి కెందు కొచ్చాడు?"

"నీ పిల్లజోలి కెవరూ రాలేదు. నీ పిల్లే వొచ్చింది మావాడి జోలికి. నీ పిల్లని నువ్వెందుకు జాగ్రత్తపెట్టుకోక వూరిమీద వొదులు తావురా?"

"నేను వొదిలానా? అది నిలవదు.... నేను...."

అంటో ఏడ్చాడు ఖాదర్.

తనకి తగిలిన దెబ్బలకి కాదు. తను రెండేళ్ళనించి పడుతున్న బాధని తలుచుకుని గావును.

"అది చెడిపోయిన మనిషి....అజాకీ, బేడకీ సిద్ధం అది.... అట్లాంటిదాన్ని తెచ్చి మందిప్పించి, శుభ్రంచేసి, నా ఇంటికి పెద్దనిచేసి పెట్టుకుంటే .... (ఏడుస్తున్నాడు).... నేను బైటికిపోతే చాలు....అది వుత్త కుక్క....ఎవడితోనంటే వాడితో పోతుంది. రైలు గార్డులు లేరూ? ఆ నాలుగు నిమిషాల్లో వాళ్ళ పెట్టెల్లో దూరుతుంది. పోలీసువా ళ్ళందరూ ఇలాకా దానికి....ఒక దేమిటి? ఏం చెయ్యను? వాళ్ళని తంతాను....ఎందర్నని, ఎన్నిసార్లని తనను?"

"దాన్ని తన్నవేం?"

"దాన్ని, దాన్ని....ఒక్కొక్క గుద్దుకి శేరు రక్తం కక్కు తుంది. మర్నాడు అంతే మళ్ళీ....

పడి పడి నవ్వుతున్నాడు సుబ్బారావు, సూర్యారావు వంక చూస్తూ.

"దాన్ని చేతులు కాళ్ళు అన్నీ విరుస్తాను. ఒకసారి వురేశాను కాని మళ్ళీ ఏడుస్తాను. అదేం పిల్లండీ: అది మనిషికాదు; దేవత. దాంతో పక్కనుంటే....నీనూ చూశా చాలా ఆడవాళ్ళని....కాని వాళ్ళందరూ దీనిముందు వుత్త దిష్టిపిడతలు. ఇది మనిషికాదండీ.... సైతాను. రాక్షసి. నా ప్రాణం కొరుక్కుతినేసింది..చీరెలు, డబ్బు ఏమడిగితే అది ఇస్తా. దీని కోసం నా ఉద్యోగం వొదులుకున్నా. బికారినైపోయినా, దీనికి కావిలికాసేందుకు. దాని కాళ్ళమీద పడి బతిమాలుతా."

"వొదిలెయ్యరాదూ?"

"వొదిలేసి పోయినాను ఓ సారి. కాని ఒక్కసారి దాన్ని మరిగితే ఇంక దిక్కులేదు మొగాడికి. నేను వాళ్ళ నడుం విరక్కొట్టినా వొదలరు దాని! మొగాళ్ళు నా వీపు తిప్పగానే దాని చుట్టూ చేరతారు ఒక్క ముద్దుకోసం...ఎటువంటివారు! ఆ తాసిల్దారు, పొగాకు కంపెనీ దొర...ఆ ట్రాఫిక్ యిన్‌స్పెక్టర్....ఎందరని చెప్పను? వొదలేను దాన్ని....వొదిలి బతకలేను...ఇన్ని చేసినా ఇంటికి వొస్తే చాలు అది నా వొళ్లో కూచుని కళ్ళు పైకెత్తి నవ్వితే చాలు. ఓ సారి చచ్చిం దనుకున్నా నేను గుండెల్లో తంతే....నేనూ చచ్చిపోయేవాణ్ణి. ఏం చెయ్యను?"

అని ఏడుస్తున్నాడు.

"చూశావా సూర్యారావ్! విన్నావా? ఏదో దేవకన్య అన్నావు. దాని హృదయం సముద్రమంత విశాల మన్నావు. అంత విశ్వాసం, ప్రేమ ఎరగ నన్నావు...."

"ఖాద రేం కవిత్వం చదివాడు?" అన్నాడు సూర్యారావు.

"అంతే నండి. అది అంతే, నాకు జరంవొస్తే ఆ రెండు వేళలా కుక్కలాగ, నిమిషం కన్ను మూయ్యకండా రక్షించి నాకు వమనం వొస్తే ప్రాణమిస్తుంది. ఏ తల్లి, ఏ భార్య చేస్తుందండి అలా! కాని అది సైతాను, బ్రహ్మరాక్షసి...." అంటో వుండగా లిల్లీ వొచ్చి మంచుంది వాళ్ళ మధ్య. ఖాదర్‌ని చూసి,

"అయ్యో! ఖాదర్, ఏమిటిది? అని అతనిమీద విరుచుకుపడ్డది. ప్రాణం లేవాడు.

"ఇంక చాలు ఈ నాటకం! ఒరె ఖాదర్, ఆ పిల్లని తీసుకుని నీ యింటికి పో" అన్నాడు.

"వాళ్లేనా నిన్ను కొట్టింది?" అని బూతులు తిడుతోంది లిల్లీ!

"చాలా ఉత్తమమైనా వాక్కులా,నీ ప్రియురాలిది సూర్యారావ్" అన్నాడు సుబ్బారావు.

లిల్లీ సూర్యారావు వంకకి జరిగి. అతని తొడమీద చెయ్యేసి మధురంగా.

"సయంగా వుందా?" అని అడిగింది.

అసలే కదులుతూన్నపళ్ళని కొరకాలని ఖాదర్ వ్యర్థప్రయత్నం చేశాడు. గుడ్లురిమి చూశాడు. కాని చీకట్లో ఎవరికీ కనపడనందున, చాలించుకున్నాడు ఆ పని.

"లేవండి, పదండి ఈపాటి" అన్నాడు సుబ్బారావు.

"వీల్లేదు" అన్నాడు ఖాదర్.

"నోరుముయ్యి. ఇంతలో ఈ రాత్రి కేం చెడిపోదులే నీపిల్ల!" అన్నాడు జాషువా.

"వీల్లేదు, చంపేస్తాడు లిల్లీని" అన్నాడు సూర్యారావు.

"చంపెయ్యనీ. లోకకల్యాణ మౌతుంది."

"వీల్లేదు, నేను భరించలేను"

"ఎట్లానూ చంపడ్రా. చంపేవాడైతే ఎప్పుడో చంపేవాడు. ఎప్పుడో దాని మూలాన వీడే చస్తాడు."

"చంపేవాడు మొదట్లోనే చేస్తాడు ఆపని."

"అతను చెప్పిన వన్నీ నిజ మనుకుంటున్నారా?" అన్నాడు సూర్యారావు.

"ఏం లిల్లీ?" అన్నాడు సాంబం.

"అన్నీ అబద్దాలు. నామీద ద్వేషం పుట్టించడానికి మీకు."

"ఏం చెప్పాడో నీమీద నీ కెట్లా తెలుసు?" అన్నాడు కోర్టులు తిరిగిన జాషువా.

"ఏం చెపుతాడో నాకు బాగా తెలుసు."

"పోనీలే. నిజాలు కానీ, అబద్దాలు కానీ వెళ్ళనీ వాళ్ళని"

"నిన్ను తన్నినందుకు వాడికి శాస్తిచేశాం ఇంక నీజోలికిరాడు."

"రాదా? వాణ్ణి చంపి...." అంటున్న ఖాదర్‌ని డొక్కలో ఓ పెద్దకన్ను తన్నాడు జాషువా. దాంతో ఖాదర్ కళ్ళుమూశాడు.

"చస్తాడేమో కొంచెం నీళ్ళు కొట్టండిరా."

"ఫరవాలేదులే. సూర్యారావు, దోరుమూసుకు పడుకో. వీళ్ళ సంగతి చూస్తాం మేము"

"వీణ్ణి తన్నాంగాని మనం అసలు దీన్ని తన్నవలిసింది." అన్నాడు సాంబం.

"ఒసేయ్! నువ్వుమావాడి ప్రమేయం లేకుండా వొదిలిపోతావా, లేకపోతే గుర్తులేకుండా నీ మొఖాన్ని మార్చమంటావా?"

"అడుగుతావేం మర్యాదగా? లోకకళ్యాణంకోసం ఆపని చెయ్యాలిరా! ఆ విష్ణుదేవుడు పురుషుల్ని నాశనం చెయ్యడానికి అన్ని అవతారా లెత్తాడు గాని, అసలు బుద్ధివున్నవాడైతే ఆ దుష్టత్వానికి కారకులైన స్త్రీలని చంపడానికి ఎత్తవలసింది అవతారాన్ని"

"అసలు నిజ మేమిటో కనుక్కోండిరా" అన్నాడు సూర్యారావు.

"చెప్పాడుకదా ఖాదర్."

"ఖాదరు కాదు. లిల్లీని చెప్పమనండి."

"ఒరే బాబూ, నువ్వేదో తెలివిగలవాడి వనుకున్నాం...."

"తెలివిగలవాడేరా! మరి ఈ స్థితిలో పడ్డాడు"

"ఆడదాని నోటినుంచి నిజం వస్తుందిరా! మూడురోజులు లెక్కరిస్తుంది. కాని నిజం ఎట్లా వొస్తుందిరా? నిజం బైటపడితే. నోరు మూసుకుని, మాటరాని ముద్దరాల్లాగా, మన గుండెలమీద కళ్ళతో పనిచేస్తుంది"

"కాదురా, నాతో చెపుతుంది. చెప్పవా లిల్లీ?"

"ఊ. మీతో వొంటరిగా...."

"వీల్లేదు."

"ఎమిత్రా! ఆడది సిగ్గు విడిచి ఎట్లా మాట్లాడుతుంది మీ అందరి ముందూ!" అని బతిమాలాడు సూర్యారావు.

"పోనీరా, మాట్లాడనీ"

సూర్యారావు మెల్లిగా లేస్తున్నాడు బాధతో.

"సూర్యారావూ, వుండు. మేమే వెడతాం! ఖాదర్ లే, మాతో షికారు రా. సూర్యారావు, ఓ గంటలో వస్తాం మళ్లీ"

కాని ఖాదర్ ఓపట్టానరాలేదు. లిల్లీచెయ్యి లాగుతాడు. చివరికి బలవంతంగా నెట్టుకుంటో తీసుకు పోయినారు అతన్ని.

వాళ్ళు వెళ్ళడంతో అమాంతం లిల్లీ సూర్యారావు మీద పడ్డది. అతని రొమ్ములో మొహం పెట్టి.

"కన్నా, కన్నా. నువ్వు లేంది బతకలేను. తీసుకో, రా, దగ్గిరికి రా" అంది.

అతను ఆమెని నెట్టేసి కఠినంగా లేచి కూచున్నాడు.

"ఖాదర్ చెప్పేవన్నీ నిజమేనా?"

"ఆ"

"ఖాద రేం చెప్పాడో నీ కేం తెలుసు?"

"ఖావరు అబద్దం మాట్లాడడు"

"ఏమిటా రోగం నీకు?"

"నా కా....నువ్వు నాప్రాణం నిన్ను చూస్తే...."

అంటో అతనిపక్కన నిలువునా తనకి అద్దుకుంది. అతనికి అన్నీ సందేహాలూ తీరిపోయినాడు.

* * *

గంట సేపటికి వాళ్ళు నలుగురూ వొచ్చే టప్పటికి ఆ ఇంటో ఎవరూ లేరు సామానూ లేను. దూరంగా వెళ్లే పన్నెండు గంటల పాపింజరు గార్డు పెట్టె వెనక ఎర్రదీపం కనపడుతోంది. ఖావరు చిందులు తొక్కుతున్నాడు.

"ఎత్తుకు పోయినాడు. ఇదంతా కుట్ర" అంటున్నాడు.

సూర్యారావుని తలుకుని ముగ్గురు మిత్రులకీచాలా అసహ్యంగా వుంది. కాని—

"ఏడిశావులే." అని ఖావరునడుంమీద తన్నాడు సాంబం.

"వాణ్ణి మూడులోకాలూ వెతికి పట్టుకు చంపుతాను" అన్నాడు ఖాదర్.

"ఏడిశావు. తీసుకుపోతే పోయినావు. ఇంకోపిల్లని చూసుకో. కాని వాడి వొంటి మీద చెయ్యేసడ్డనా పద్నాలుగు లోకాలూ వెతికి నిన్ను నరుకుతాం జాగర్త."

అని ముగ్గురూ రైలుస్టేషన్‌కి వెళ్ళిపోయినారు, సూర్యారావు ముందు జాతకాన్ని విమర్శించుకుంటో. అర్ధరాత్రి శూన్యమైన ఆ ఇంటో, లోకమే శూన్యమై ఖాదరు ఏడుస్తున్నాడు. దూరంగా గ్రామఫోను

దునియామె కోన్ హమారా అని పాడుతోంది.